ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.3 । కనిష్ఠం 24.2





● ఇటీవల జైనథ్ మండలంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనంతో పోలీసులు

వక్రమార్గం

సరిహద్దులు దాటుతున్న సబ్సిడీ బియ్యం

- గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న దళారులు
- యథేచ్ఛగా సరిహద్దులు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- పత్తాలేకుండా పోయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- చెక్‌పోస్టు అధికారుల కనుసన్నల్లోనే అక్రమ దందా
- పోలీసుల తనిఖీల్లో క్వింటాళ్ల కొద్దీ పట్టుబడుతున్న దొడ్డు బియ్యం



ఉట్నూరు మండలంలో రేషన్ బియ్యంతో పట్టుబడిన వాహనం

ఆదిలాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు వక్రమార్గంలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆహార భద్రత పథకాన్ని అభాసుపాలు చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు జిల్లా మీదుగానే రేషన్ బియ్యాన్ని తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. 'దొరికితే దొంగ.. లేదంటే దొర' అన్న చందంగా రేషన్ బియ్యం దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. ఏదైనా ముందస్తు సమాచారం అందితేనే అధికారులు హడావిడి చేస్తున్నారు. లేదంటే రేషన్ అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి రేషన్ దందా కొనసాగుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇటీవల జైనథ్ మండలం పిప్పరవాడ టోల్ ప్లాజా వద్ద 290క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. దీనిని మరిచిపోకముందే తాజాగా గురువారం ఉట్నూర్ మండలంలో 20 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని పలువురిపై కేసులు నమోదు చేశారు. జిల్లామీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారి అక్రమ దందాలకు అడ్డాగా మారుతోంది. రహదారి మీదుగానే రహస్యంగా రవాణా జరుగుతోంది. అదునుచూసి జిల్లా సరిహద్దుల్లో ఉన్న బోథ్ మండలం ఘన్‌పూర్ చెక్‌పోస్ట్, తలమడు గు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్, జైనథ్ మండలం భోరజ్ చెక్‌పోస్ట్‌ల మీదుగా నిత్యం వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

దొడ్డు బియ్యం తింటలేరు..

ప్రభుత్వం ఉచితంగా పరఫరా చేస్తున్న దొడ్డు బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు తినేందుకు ఇష్టపడడం లేదని తెలుస్తోంది. దీంతో చౌకధరల డీలర్‌ల నుంచి నెలనెలా రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు పెద్ద మొత్తంలో పోగుచేసి దళారులకు అమ్మేసుకుంటున్నారు. బడా వ్యాపారులు మధ్యవర్తులను రంగంలోకిదించి రేషన్ బియ్యాన్ని సేకరి స్తున్నారు. కిలో రూ.10 నుంచి 15రూపాయల వరకు కొనుగోలు చేస్తూ ఇదే బియ్యాన్ని వ్యాపారులు ఇతర రాష్ట్రాల్లో 20నుంచి30 రూపాయల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వచ్చిన లాభాల్లో వ్యాపారులు ఎంతో కొంత అధికారులకు ముట్టజెప్పడంతోనే ఈ వ్యవహారాన్ని తేలికగా తీసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తూ వదిలేయడంతో రేషన్ అక్రమ దందాకు అసలు అడ్డుకట్ట పడడం లేదంటున్నారు.

చెక్‌పోస్టు అధికారుల కనుసన్నల్లోనే..

జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టు అధికారులతో వ్యాపారులు రహస్య సంబంధాలను పెట్టుకుంటూ తమ అక్రమ దందాకు అడ్డు రాకుండా ముందస్తు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. చెక్‌పోస్టు అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా సాగుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు చెక్‌పోస్టు అధికారుల తనిఖీల్లో ఏ ఒక్క వాహనం బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన దాఖలాలు లేవు. రాత్రికి రాత్రే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు తరలిస్తూ రాయితీ బియ్యాన్ని అమ్మేసుకుంటున్నారు. వ్యాపారులు తెలివిగా వ్యవహరిస్తూ పాత వాహనాలలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఒకవేళ అధికారులకు పట్టుబడితే పెద్దగా నష్టం ఉండదన్న ఆలోచనతో జాగ్రత్త పడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో రేషన్ బియ్యానికి భారీగా డిమాండ్ ఉండడం.. చౌకగా దొరకడంతో వ్యాపారులు వేల క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నారు.

అధికారుల తనిఖీలు నిల్..

జిల్లాలో జోరుగా రేషన్ బియ్యం దందా సాగుతున్నా సంబంధిత అధికారుల తనిఖీలు కరువయ్యాయి. అడపాదడపాగా ముందస్తు సమాచారంతో పోలీసులు తనిఖీలు చేయడంతో అక్రమరవాణా గుట్టురట్టవుతోంది. కానీ పౌరసరఫరాల శాఖ అధికారులు పత్తా లేకుండానే పోయారన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులకు దారితీస్తుందంటున్నారు. సిబ్బంది కొరత కారణంగానే తనిఖీలు చేయడానికి సాధ్యపడడం లేదని ఉన్నతాధికారులు బహిరంగంగానే చెప్పడం చూస్తుంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తూనే ఉంది. నిఘా సారించి క్షేత్రస్థాయిలో దాడులు నిర్వహిస్తే వందల క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టుబడే అవకాశం ఉం దంటున్నారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసే అడ్డాలు అధికారులకు తెలిసినా.. చూసీచూడనట్లుగానే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని పదోతరగతి పరీక్షల కేంద్రాలను జడ్పీహెచ్‌ఎస్ యాపల్‌గూడ, ఎంపీపీఎస్ యాపల్‌గూడ, ఏహెచ్‌ఎస్ మామిడి గూడలో ఏర్పాట్లు పూర్తయినట్లు ఆదిలాబాద్ రూరల్ మండల విద్యాధి కారి కంటె నర్సయ్య తెలిపారు. గురువారం ఏహెచ్‌ఎస్ మామిడి గూడ(జీ) పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ మొత్తం 196 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఏహెచ్‌ఎస్ మామిడిగూడ, ఏహెచ్‌ఎస్ వాన్‌వాట్, ఏహెచ్‌ఎస్ చించుఘాట్, ఏహెచ్‌ఎస్ సిచ్‌దార్ ఖానాపూర్‌తోపాటు జడ్పీహెచ్‌ఎస్ అంకోలి పాఠశాల విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఎంఈవో వెంట పరీక్షల నిర్వాహకులైన శ్రీనివాస్, చీఫ్ సూపరింటెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ దిలీప్, కస్టోడియన్ సత్యనారాయణ ఉన్నారు.

నార్నూర్ : ఉమ్మడి మండలంలోని గాదిగూడ, తాడిహత్నూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లుగా సీఎస్ రవీందర్ రాథోడ్ తెలిపారు. సెంటర్‌లో మొత్తానికి 6 పాఠశాలలు అనగా హస్నాపూర్ జిల్లా పరిషత్, విద్యార్థులు, తాడిహత్నూర్ జిల్లా పరిషత్, విద్యార్థులు మన్యాపూర్ విద్యార్థులు బాలికల, జముడా విద్యార్థులు బాలికలు మొత్తానికి 164 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లుగా పేర్కొన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌సెంటర్‌లో 192 మంది విద్యార్థులు 10 పరీక్షలు రాస్తున్నట్లుగా సీఎస్ రవిప్రసాద్ తెలిపారు.

ఇంద్రవెల్లి : పదో తరగతి పరీక్షల కోసం మండలంలోని పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈవో రాథోడ్ మాను కుమార్ తెలిపారు. మండలంలోని మూడుపరీక్ష కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలను రాసే విద్యార్థుల కోసం అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మొత్తం 610 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మండల కేంద్రంలోని స్థానిక జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 190 మంది విద్యార్థులు, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 190 మంది, మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో 230 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

బోథ్ : మోడల్‌స్కూల్లో ప్రత్యేక అధికారిగా డి.వెంకన్న రెసిడెన్షియల్ పాఠశాలలో ఎం.సుభాష్, కౌట బీ పాఠశాల సెంటర్లో గిడం చందన్, సొనాల సెంటర్‌లో హనుమాన్లు విధులు నిర్వహిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు పరీక్షలను విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. సెంటర్లలో ఫ్యాన్లు విద్యుత్ బల్బులు తప్పని సరిగా ఉండాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ఉట్నూర్ : పదోతరగతి పరీక్షల కోసం పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని మండల విద్యాధికారి ఆశన్న తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థులను కేటాయించామని, నాలుగు పరీక్ష కేంద్రాల్లో 880 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. ఉట్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చీఫ్ సూపరింటెంట్‌గా రమేష్, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్‌గా రమేష్ రెడ్డి నియమించారు.

మంత్రిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



మంత్రిని సన్మానం చేస్తున్న నాయకులు

నార్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ బిల్లు ఉభయ సభలో ఆమోదం తెలపడంపై హైదరాబాద్‌లో గురువారం రాష్ట్ర మంత్రి దామోదర్ నరసింహను నాయకులు సన్మానించారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరైల మహేందర్ కలిసి పుష్పగుచ్ఛం అం దించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిన ప్రాంతానికి అభివృద్ధి దిశగా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. బ్యాంకులకు సంబంధం లేకుండా ఎస్సీ కార్పొరేషన్ నిరుద్యోగ యువతకు రూ.20 లక్షల రుణ సదుపాయం కల్పించాలని వికలాంగుల వితంతువు మహిళలు అభివృద్ధి కోసం ప్రత్యేక కేటగిరిగా విభజించి అధిక మోతాదులో రుణాలు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు ఏజెన్సీలకు అభివృద్ధికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపైన అవగాహన సదస్సు

బోథ్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మిషన్‌శక్తి ఆధ్వర్యంలో మహిళల హక్కులు, బాలలహక్కులపైన మిషన్ శక్తి ఐసీడీఎస్ వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వం శక్తి జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న లింగ ఉత్పత్తిపై వివరించారు. విద్యాహక్కు చట్టంపైన వివరించడంతో పాటు ఆపదలో ఉన్న మహిళలు సఖి హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరారు. బాల్యవివాహాలు చేయడం నేరమని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా కోరారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా



జైనథ్‌లో నీటిశుద్ధీకరణ యంత్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

జైనథ్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, వాటిని సాధించి సమా జానికి సేవచేయాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. జైనథ్ ఆదర్శ పాఠశాలలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాల మేరకు పట్టుదలతో కృషిచేసి వాటిని సాధించాలని తెలిపారు. పదిసంవత్సరాల నిడివి లక్ష్యాల ను ఏర్పాటు చేసుకుని వాటిని కృషి చేసేందుకు కృషిచేయాలని, కానీ ఎట్టి పరిస్థితిలో మానసికంగా ఒత్తిడికి గురికావద్దని సూచించారు. ఉపాధ్యాయులు స్ఫూర్తితో పనిచేసే విషయాలను వివరిస్తూ వారిలో జిజ్ఞాసను నెలకొల్పాలని అన్నారు. జిల్లా విద్యాధికారిణి ప్రణీత మాట్లాడు తూ... పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించాలని అభిలాషించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో రవీందర్‌నాథ్, ఆరోగ్య పాఠశాల జిల్లా సమన్వయకర్త అజయ్, ప్రిన్సిపాల్ అందే రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

- మాదక ద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిగా రూపుమాపాలి
- నార్నూర్, గాదిగూడ పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ



నార్నూర్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ, ఏఎస్పీ

నార్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నందున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. గురువారం సాయంత్రం నార్నూర్, గాదిగూడ పోలీస్‌స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. మొదటగా పోలీస్‌స్టేషన్‌ల పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్‌లు పరిశుభ్రతను కలిగి ఉండాలని సూచించారు. నూతన పోలీసు సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే విధంగా విధులను నిర్వర్తించాలని తెలిపారు. రిసెప్షన్ సెంటర్లకు వచ్చే ప్రతి ఒక ఫిర్యాదుదారు అభ్యర్థిని స్వీకరించి సత్వర పరిష్కారం అందించే దిశగా సిబ్బందిని కేటాయించి న్యాయం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు గంజాయి మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పండించడం, సేవించడం, వ్యాపారం చేయడం నేరంగా పరిగణించబడుతుందన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, నార్నూర్ సీఐ రహీం పాషా, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

'జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను తొలిగించాలి'

జైనథ్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జైనథ్ మార్కెట్ కమిటీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను వెంటనే తొలగించాలని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ డిమాండ్ చేశారు. గురువారం జైనథ్ మండల కేంద్రంలోని మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జైనథ్‌లో విధులు నిర్వహిస్తున్న పాత హమాలీల కాంట్రాక్టర్ ద్వారా రూ.1.50 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. మూడురోజులుగా శనగ కొనుగోళ్ళు జైనథ్‌లో నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చ జైనథ్ మండల అధ్యక్షులు ఏనుగు రాకేష్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు అస్తక్ సుభాష్, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్షలు రాసిన ఇంటర్ విద్యార్థులు

ఉట్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 3 నుంచి ప్రారంభం అయినా ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉట్నూర్ మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఇంటర్‌బోర్డు అధికా రులు ఏర్పాటు చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాల, కొమురం భీం ప్రాంగణంలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాల లాల్ టేకిడి బాలుర జూనియర్ గురుకుల కళాశాల, ఉట్నూర్ పట్టణంలోని పులాజీ బాబా జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల, ఏఆర్ఎస్ జూని యర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 2076 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 1764 మంది విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు ప్రశాంతంగా పూర్తికావడంతో విద్యార్థులు సంతోషంగా ఇండ్ల బాట పట్టారు.

నార్నూర్ : ఇంటర్మీడియట్ పరీక్షలు చివరి రోజు కావడంతో మండల కేంద్రానికి జిల్లా ఇంటర్ మాధ్యమిక విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న పరీక్ష కేంద్రాలను ప్రతి గదికి వెళ్లి పరిశీలన చేశారు. అనంతరం కళాశాల ఆవరణ ఇతర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. 12 రోజుల నుంచి జరిగిన పరీక్షలపై జిల్లాలో చాలా ఎలాంటి మాస్ కాపియింగ్‌కి చోటు లేదు తెలిపారు. ఉపాధ్యాయ బృందం సీఎస్ డీఓ, ఇన్విజిలేటర్ అభినందించారు. వారి వెంట అధికారులు ఉన్నారు.

ప్రజావాణి కార్యక్రమంపై అవగాహన

సిరికొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు ప్రతీనెల మండల కేంద్రంలో జరిగే ప్రజావాణిని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్, డీఆర్‌డీవో ఆదేశానుసారం గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీవోఏలకు ప్రజావాణి కరపత్రాలను పంపిణీ చేసి ఆయన అవగాహన కల్పించారు. ప్రజావాణిలో వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులకు అందజేయడం ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.

20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

- నలుగురిపై కేసు
- ఉట్నూర్ డీటీసీవో ఏఎస్పీ కాజల్‌సింగ్



స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనం

ఉట్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సుమారు రూ.40 వేల విలువగల ప్రభుత్వ రాయితీ బియ్యం, తరలిస్తున్న వాహనం స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసులు నమోదు చేశామని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ తెలిపారు. అక్రమసరుకు రవాణా చేసే వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. బుధవారం రాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 20 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం లభ్యమైందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ తెలిపారు. రేషన్‌డీలర్ నళిని కిష్టయ్యతో పాటు ఆయనకు సహకరించిన డ్రైవర్ ఠాకూర్ అరుణ్‌సింగ్, ఠాకూర్ ధారాసింగ్, గ్యాన్‌సింగ్‌లపై కేసు నమోదైందని, బియ్యం తరలిస్తున్న వాహనం స్వాధీనం చేసుకుందామని తెలిపారు. అక్రమ వ్యాపారం ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని లబ్ధిదారుల వద్ద నుంచి కొనుగోలు చేస్తూ ఎక్కువ ధరలకు అమ్ముతున్న దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు



కౌన్సిలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నేరడిగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందిడి గ్రామంలో బాల్యవివాహం జరుగుతుందని తెలుసుకొని అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే బొందిడి గ్రామంలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న 17 సంవత్సరాల అమ్మాయికి పెళ్లి నిశ్చయించారని తెలుసుకున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్‌వారి సహకారంతో గ్రామానికి వెళ్లి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. అదే విధంగా గ్రామస్థులకు చైల్డ్‌మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కో-ఆర్డినేటర్ సతీష్, పీఓఐసీ స్వామి సోషల్‌వర్కర్ రవికాంత్, అంగన్‌వాడీ టీచర్, ఆశవర్కర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం

● మాజీ మంత్రి జోగు రామన్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి, 20 : రాష్ట్ర బడ్జెట్‌లో ఆదిలాబాద్‌కి మొండిచేయి చూపారని, అంకెల గారడిగా బడ్జెట్‌ను రూపొందించారని మాజీ మంత్రి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న ఆరోపించారు. ఈ సందర్భంగా గురువారం ఆదిలాబాద్ పట్టణ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అభివృద్ధిపై ఎమ్మెల్యేకు పట్టింపులేదని ధ్వజ మెత్తారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, రమేష్, సాజితోద్దిన్, పవన్, దయానందర్, శివకుమార్, మహేష్ పాల్గొన్నారు.

ఏజెన్సీ ఉమ్మడి మండలానికి బడ్జెట్‌లో మొండి చెయి : బీజేపీ

నార్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఏజెన్సీ ప్రాంతం నార్నూర్, గాదిగూడ మండల అభివృద్ధికి మొండిచెయి చూపిందని భారతీయ జనతా పార్టీ నార్నూర్ మండల అధ్యక్షులు బిక్కు రాథోడ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చాలా గ్రామాలు దళిత ఆదివాసీ గిరిజన ప్రజలకు అత్యవసర సేవలు అందడం లేదన్నారు. సమావేశంలో నాయకులు శావన్, రవి, మహేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆడే గజేందర్

నేరడిగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన బొడిగే కళ కుమారుడు గణేష్ బోరిగామ వద్ద ప్రమాదానికి గురై మరణించాడు. వారి ఇంటికి కుటుంబసభ్యులను కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్ పరా మర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన గదం భోజవ్వ అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కప్పర్లలో పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య

తాంసి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు రాజలింగు (48)పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన గురువారం ఉదయం మృతి చెందినట్లు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా రాజలింగు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ ఉద్యమాన్ని మరింత ముందుకు సాగించడంతో ఎట్టకేలకు ప్రభుత్వం బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఎమ్మె ల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బీసీ సంఘాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దుట మహేందర్, క్రాంతికుమార్, బాబాశ్యాం, కుర్సెంగా భూమన్న పాల్గొన్నారు.

ఆదివాసీ వికలాంగ కుటుంబానికి ఆర్థికసాయం

నార్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని పునగూడ గ్రామానికి చెందిన డగరి పెందుర్ ఇంద్రబాన్ అనే వికలాంగ నిరుపేద కుటుంబానికి ఆసిఫాబాద్ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షులు కొట్నాక్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పెందుర్ సంతోష్, యశ్వంత్ రావు, లచ్చు, రమేష్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



తలమడుగులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్యాణలక్ష్మి పథకంతో పాటు ఆడపడుచులకు తులం బంగారం ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆరోపించారు. గురువారం తలమడుగు మండలానికి చెందిన వివిధ గ్రామాల 72 మంది లబ్ధిదారులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, కేదారేశ్వర రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కాటిపేల్లి వసంత్ రెడ్డి సొంత నిధులతో తలమడుగు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మాణం చేపడుతున్నందున ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించి అభినందించారు.

బోథ్ : మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో గురువారం శాసన సభ్యులు జాదవ్ అనిల్ శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డీఎం ప్రవీ ణ్‌రెడ్డితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డుగంగారెడ్డితో పాటు సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్ పాల్గొన్నారు.

స్వామిని పరామర్శించిన అనిల్ జాదవ్

భీంపూర్ : మండలంలోని నిపాని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అనిల్‌జాదవ్ వీరాభిమాని మల్లెల స్వామి తండ్రి మల్లెల అశోక్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులతో కలిసి పరామర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవనాన్ని గురువారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరిశీలించారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఉట్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఎస్‌సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ, యువకులకు రాజీవ్ యువ వికాసం ప్రవేశపెట్టినందుకు హర్షిస్తూ మండలంలోని గంగన్నపేటలో హనుమాన్ భక్తులు సీఎం రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మండలంలోని లక్కారంలో హనుమాన్ మందిరం ఆవరణలో అంజనేయస్వాములు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేత గొల్లపెల్లి శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

బోథ్ : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. గురువారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో బీసీలకు 40 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అభినందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజు యాదవ్, ఏఎంసి డైరెక్టర్ ఎల్. పోశెట్టి నారాయణ, శివయ్య, వెంకటరమణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఇంద్రవెల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జైత్రం తండా గ్రామానికి చెందిన రాథోడ్ నూర్‌సింగ్ సెల్‌ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్‌లను ఎస్సై దుబ్బాక సునీల్ గురువారం ఆయన అందజేశారు. పోలీసు సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలకు ఆర్వో విరాళం

ఉట్నూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ ఆర్వో వాటర్ ప్లాంట్‌ని, ప్రింటర్‌ని విరాళంగా గురువారం అందించారు. ఐడీబీఐ బ్యాంక్ ఉట్నూర్ శాఖ మేనేజర్, దాసరి మహేందర్, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐడీబీఐ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మంచిర్యాల్ రాఘ వేంద్ర రావులు ఆర్ఓ ప్లాంటును పాఠశాలలో ప్రారంభించారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ జాదవ్, అదేవిధంగా పాఠశాల సిబ్బంది కృష్ణ, నిరూపనాయక్, జాడీరమేష్, రాములు, రాథోడ్ ఉపేందర్, ఉపాధ్యాయులు అజ్మీరరామ్‌ప్రసాద్, సునీల్, నవీన్ పాల్గొన్నారు.

శ్రీగురు పట్టాభిషేక మహోత్సవం

ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి, 20 : ఆదిలాబాద్ పట్టణంలోని కన్యక పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న వైశ్యుల గురువు శ్రీ వామన శ్రమ స్వామిజీ 21వ శ్రీగురు పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో వైశ్యకులస్థుల పాత్ర అభినందనీయమనీ పేర్కొన్నారు. దేశంలో ఏ పుణ్యక్షేత్రానికి వెళ్లిన అక్కడ ఆర్య వైశ్యులు నిర్మించిన సత్రాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వన్ నేషన్, వన్ ఎలక్షన్‌కు మద్దతు ఇవ్వండి

● ఎమ్మెల్యే పాయల శంకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

మావల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఒకే సారి అన్ని ఎన్నికలు నిర్వహిస్తే సమయంతో పాటు కోట్ల ప్రజల ధనం వృథా కాకుండా ఉంటుందని, అందుకు ప్రతి ఒక్కరు వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు మద్దతు తెలిపాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని నలంద కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వన్‌నేషన్, వన్ ఎలక్షన్ వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ రెండు రోజుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్వైకే అధికారి సునీల్, కళాశాల ప్రిన్సిపల్ పున్నరావ్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్ గోపాల్, విశ్రాంత అధ్యాపకులు విజయ్ బాబు, బిజెపి నాయకులు ముకుందరావు, అశోక్ రెడ్డి, శివ త తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నేరేడిగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలలోని పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రిని ముత్యాలిబాయి హమ్ము నాయక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో శ్రీ రజిత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కరణ్‌సింగ్, అంబారావు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు : ఎస్సై శ్రీకాంత్

నేరడిగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్‌లతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటోడ్రైవర్‌లు అదనపు ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని అన్నారు. వాహనాల పత్రాలు, ఆర్‌సీ, ఇన్సు రెన్స్ తదితర పత్రాలను వెంట ఉంచుకోవాలని కోరారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించకుంటే జరిగే పరిణామాలను వివరించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ఇంద్రవెల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎవరైనా అతిక్రమించి ప్రయాణికులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై దుబ్బాక సునీల్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఆటోడ్రైవర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కి పిలిచి ఎస్సై ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతి ఒక్కరు విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ప్రమాదబీమా కలిగి ఉండాలన్నారు. ఏఎస్సై కె.రమేష్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్ : ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం మండల కేంద్రంలో ఎస్సై మహేందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వెళ్ళేటపుడు నిర్లక్ష్యంగా ఆటోలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

'వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు'

నేరడిగొండ , మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని తేజాపూర్, చించోలి, లక్ష్మంపూర్ గ్రామాలలో తాగునీటి వనరుల క్షేత్రాలను పరిశీలించారు. వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశాలున్న గ్రామాలలో ముందస్తుగానే వ్యవసాయ బావులు బోరుబావులు గుర్తించామన్నారు. ఎంపీడీవో వెంట ఎంపీఓ లక్ష్మణ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఈజీ సుభాష్, వ్యవసాయ అధికారి కృష్ణవేణి, ఉపాధి హామీ సిబ్బంది పంచా యతీ కార్యదర్శులు ఉన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించడం తగదు'



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోథ్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పెట్టిన భిక్షతో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవి అనుభవించి ఇప్పుడు పార్టీని మాజీ ఎంపీపీ ఎత్తుల శ్రీనివాస్ విమర్శించడం తగదని పలువురు నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పశులచంటి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్ పేర్కొన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాజీఎంపీపీ రాజకీయ భవిష్యత్తు ఆలోచించుకోవాలని అయితే స్థానిక సంస్థ ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కవని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో సోనాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల పోతన్న, లోలపు పోశెట్టి, మాజీ ఎంపీటీసీ మహేందర్, బోథ్ పట్టణ నాయకులు భోజన్న, షేక్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



భైంసా, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు గురువారం ముగిసాయి. చివరి రోజైన గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. సంబంధిత పరీక్షలకు 5,232 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,072 మంది విద్యార్థులు హాజరవ్వగా 150 మంది గైర్హాజరయ్యారు. డీఐఈవో పరుశురామ్ సారథ్యంలో పరీక్షల నిర్వాహణాధికారులు అవలంభించిన ప్రణాళికబద్ధమైన విధానాలు, పకడ్బందీ చర్యల మూలంగా ఇంటర్ పరీక్షలు ఆద్యంతం సజావుగా కొనసాగాయి. ఇంటర్ పరీక్షలు పూర్తవ్వడంతో విద్యార్థుల ఆనందానికి అవదులు లేకుండా పోయింది. పరీక్షా కేంద్రాల నుంచి బయటకు రాగానే విద్యార్థులు పేపర్లను చించి గాల్లోకి ఎగరవేస్తూ ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు అలింగనం చేసుకుంటూ గుడ్‌బై చెప్పుకున్నారు. ఇక పరీక్షలు ముగిసిన నేపథ్యంలో వసతి గృహాల్లోని విద్యార్థులు తమ తమ స్వస్థలాలకు తరలివెళ్లారు.

● **ఏఎస్పీని సన్మానించిన యూనియన్ శ్రేణులు**

డివిజన్ పరిధిలో ఇంటర్ పరీక్షలు సజావుగా కొనసాగేందుకు గాను పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చర్యల ద్వారా సహకరించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్‌ను తెలంగాణ గజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. గురువారం ఇంటర్ పరీక్షల ప్రక్రియ పూర్తయిన పిదప టీజీఎల్ఏ జిల్లా అధ్యక్షులు కార్గాం వినోద్ కుమార్ సారధ్యంలో యూనియన్ శ్రేణులతో పాటు భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతినిధులు బృందం ఎస్‌డీపీవో కార్యాలయానికి తరలివెళ్లి ఏఎస్పీ అవినాష్ కుమార్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు.

దిలావర్‌పూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడి యట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కాగా పరీక్షలు రాసి బయటకు వచ్చిన విద్యార్థుల్లో పరీక్షలు అయిపోయాయన్న ఆనందం ఒక వైపు, ఇకపై కళాశాలను వదలి వెళ్లక తప్పదన్న ఆవేదన కనిపించింది.

కేజీబీవీ విద్యార్థుల వీడ్కోలు సమావేశం

నర్సాపూర్(జి), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేజీబీవీ పాఠ శాలలో, కళాశాలలో గత ఏడు సంవత్సరాల కిందట అడ్మిషన్ పొందిన బాలికలు గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిసిన సందర్భంగా స్కూల్, కాలేజీ నుండి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని మరువలేక కన్నీటి పర్యంతం అయ్యారు. ఇక మీదట వారి వారి ఉన్నత చదువుల కోసం మరొక చోటికి వెళ్లాల్సిన సమయం వచ్చింది. కాబట్టి ఇక్కడ ఉన్నటువంటి టీచర్లను విడిచి వెళ్లే సందర్భంలో పిల్లలు వారితో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎంతో దుఃఖంతో వెళ్లారు. టీచర్లు పిల్లలందరికీ మా కన్న మంచి భవిష్యత్తు మీరు పొందాలని, ఈ పాఠశాలను, కళాశాలను ఎప్పటికీ మరిచిపోవద్దని, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి మళ్లీ నర్సాపూర్ పాఠశాలకు వచ్చి మీ అనుభవాలను పంచుకోవాలని ఆశీర్వదించి పంపించారు.

మందిర నిర్మాణానికి నిధుల మంజూరుకు వినతి

నిర్మల్ కల్చరల్, మార్చి (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం భాగ్యనగర్‌లోని రాధాకృష్ణ మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఆలయ కమిటీ సభ్యులు డీసీసీ అధ్యక్షుడు కేశ్రీహరిరావును కోరారు. గురువారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

మద్యం మత్తులో భార్యను చితకబాది చంపిన నిందితుడి అరెస్ట్

● భార్య చనిపోయాక సహజ మరణంగా చిత్రీకరించేందుకు నిందితుడి యత్నం ● శవానికి బొట్టు పెట్టి, గాజులు తొడిగి మేకప్ చేసిన వైనం



అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు

ఖానాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాసు నాయక్ తండా గ్రామంలో మద్యం మత్తులో అన్నం పెట్టడం లేదని భార్యను చితకబాది చంపి ఆపై సహజ మరణంగా చిత్రీకరించినందుకు శవానికి అలంకరణ చేసిన నిందితుడిని ఖానాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ సీఐ అజయ్ తెలిపిన కథనం ప్రకారం... పెంబి పోలీస్ స్టేషన్ పరిధిలోని దాసు నాయక్ తండా గ్రామానికి చెందిన లావుడ్యా అర్జున్‌కు గోసంపల్లి గ్రామానికి చెందిన నిరోజాతో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కాగా ఈ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు జన్మించారు. అర్జున్ దాసు నాయక్ తండాలో పశువులను కాచుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కాలంలో మద్యానికి బానిసై తరచుగా భార్యతో గొడవకు దిగాడు. భార్యాభర్తలిద్దరూ గొడవ పడడం గమనించిన అతని నానమ్మ అరుణ చిన్నతనం నుండి వారిద్దరి పిల్లల్ని తన వద్ద పెంచుతోంది. కాగా ఈ నెల 18వ తేదీన రాత్రి పది గంటలకు మద్యం తాగి వచ్చి భోజనం పెట్టమంటే పెట్టలేదని తిడుతోందని తన భార్య నిరోజాతో అర్జున్ గొడవపడ్డాడు. తన జల్సాలకు తరచుగా అడ్డుపడుతున్న భార్యను చంపాలనే ఉద్దేశంతో కింద పడేసి తీవ్రంగా కొట్టాడు. గొంతు మీద కాలు వేసి తొక్కడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. దీంతో నిరోజా మరణాన్ని సహజ మరణంగా చిత్రీకరించేందుకు శవానికి బొట్టు పెట్టి, గాజులు తొడిగి, చీర సర్ది, జుట్టును సర్ది, మేకప్ వేసి యధావిధిగా తిరిగి తెల్లారి పశువులను మేపేందుకు అడవికి వెళ్లాడు. తాను భార్యను కొట్టిన విషయం పక్క వాళ్లు చూడడంతో ఇంటికి వెళ్తే తనను గ్రామస్థులు కొడతారని భావించి ఈ నెల 19వ తేదీన ఉదయం 11:30 గంటల సమయంలో మృతురాలు అన్న గంగాధర్‌కు ఫోన్ చేసి మీ చెల్లెను చంపేసినాను వచ్చి తీసుకపో అని తెలిపాడు. దీంతో అతను తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి మృతురాలిని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు గురువారం సాయంత్రం నేరస్తుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం రాత్రి సీఐ అజయ్ వివరాలు వెల్లడించారు. తన భార్యను చంపిన విషయాన్ని నిందితుడు పోలీసుల ఎదుట అంగీకరించినట్లు సీఐ పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తా : అల్లోల



సారంగాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అడెల్లి ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి పనులతో పాటు బోథ్, సారంగాపూర్ రహదారి నిర్మాణ అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా కృషి చేస్తానని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో గల అడెల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులను మొక్కారు. ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మ వారికి హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టి శాలువాతో సన్మానించారు. అలాగే ఆలయ అభివృద్ధి నిర్మాణ పనులతో పాటు బోథ్, సారంగాపూర్ రహదారి నిర్మాణ పనులను పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయ నిర్మాణం పనులు పూర్తి అయితే భక్తులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. వీటి నిర్మాణ పనులు వెంటనే పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులతో సంప్రదించి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇటీవలే నిర్మాణ పనులు పూర్తయిన రహదారి పైన వాహనంలో నాయకులతో, కార్యకర్తలతో సారంగాపూర్ నుండి బోథ్ సరి హద్దు వరకు వెళ్లి పనులను పరిశీలించారు. దీంతో ఈ రోడ్డుపై వాహనాలపై ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మాజీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈయన వెంట మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, పారిశ్రామిక వేత్త అల్లోల మురళిధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు ఐరా నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, మాజీ అడెల్లి మహా పోచమ్మ దేవాలయం చైర్మన్ చందు, నా యకులు మాధవ్‌రావు, పాకాల రాంచందర్, ఇస్మాయిల్, రవీందర్‌రెడ్డి, మధుకర్, భూమా రెడ్డిలతో పాటు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంకెల గారడి బడ్జెట్‌తో

కాంగ్రెస్ ప్రజలను మోసగించింది

● బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

ఖానాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో అంకెల గారడీతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మరోసారి మోసగించిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆటో డ్రైవర్ల నుంచి అన్నదాతల వరకు అందరినీ మోసగించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై బడ్జెట్‌లో ఊసే ఎత్తలేదని ఎద్దేవా చేశారు. 2025-26 మొత్తం రాష్ట్ర బడ్జెట్ 3,04,965 లక్షల కోట్లలో రెవెన్యూ బడ్జెట్ 2,26,982 కోట్లలో గిరిజన నిష్పత్తి ప్రకారం గిరిజన సబ్ ప్లాన్‌కు 22,698 కోట్లు న్యాయంగా రావాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం 17,169 కోట్లు మాత్రమే కేటాయించి గొప్పగా కేటాయించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను విస్మరించిన ఈ బడ్జెట్‌ను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని జాన్సన్ నాయక్ పేర్కొన్నారు.

జాతి సమస్యలపై పోరాడేందుకు

ఎల్‌హెచ్‌పీఎస్ ముందంజలో ఉంటుంది

ఖానాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : లంబాడా జాతి సమస్యలపై పోరాడేందుకు లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఎల్లప్పుడూ ముందంజంలో ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు హపావత్ రాజేందర్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఖానాపూర్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షులుగా గుగ్లావత్ విలాస్, ప్రధాన కార్యదర్శిగా హపావత్ ప్రభాకర్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిషన్ నాయక్, రాష్ట్ర సీనియర్ నాయకులు గోవింద నాయక్, రాజేశ్వర్ నాయక్, తదితరులున్నారు.

'పది' పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈవో

ముథోల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆశ్రమ, రబింద్ర, ప్రభుత్వ ఉన్నత పాటశాల, మండలంలోని అష్ట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం ముథోల్ మండల విద్యాధికారి (ఎంఈవో) రమణారెడ్డి పరిశీలించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో బాసరకు మొండిచేయి

● బాసర ఆలయానికి కేటాయింపులు నిల్..

● ట్రిపుల్ ఐటీకి అరకొరగా..



బాసర, మార్చి, 20 : (ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బాసరకు మరోసారి నిరాశే మిగిలింది. రాష్ట్రంలో ఉన్న ఏకైక యూనివర్సిటీ ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) అదేవిధంగా ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన జ్ఞాన సరస్వతి అమ్మవారు కొలువై ఉన్న బాసర క్షేత్రంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. రాష్ట్ర బడ్జెట్‌లో అమ్మవారి దేవస్థానానికి చోటు కల్పించకపోగా, ట్రిపుల్ ఐటీకి అరకొర నిధులు కేటాయించారు. అనేక సమస్యలకు నిలయంగా మారిన ఈ రెండు ప్రముఖ ప్రభుత్వ సంస్థలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం స్థానికులను ఆగ్రహానికి గురి చేస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో బాసర ట్రిపుల్ ఐటీ వేలాది మంది విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టగా ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాసర వచ్చి మద్దతు పలికారు. సమస్యల పరిష్కారానికి ఆనాడు ఓదార్చిన రేవంత్‌రెడ్డిపై విద్యార్థుల్లో అంచనాలు ఎక్కువయ్యాయి. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన గత ఏడాది బాసర ట్రిపుల్ ఐటీకి ఆశించిన స్థాయిలో నిధులను కేటాయించకపోగా ఈ సారి కూడా విస్మరించారు. తాజాగా మూడు నెలల క్రిందట జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క సైతం యూనివర్సిటీకి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలన్నీ విద్యార్థులకు అత్యవసరమైనవని వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందంటూ వ్యాఖ్యానించారు. మరో పక్క ప్రాచీనమైన బాసర సరస్వతి అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరుతోంది. దేశంలోనే రెండో ప్రాచీన దేవాలయంగా వెలుగొందుతున్న బాసరలో కనీస వసతులు లేక వచ్చిన యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని బాసర పుణ్యక్షేత్రం చివరి దశలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 50 కోట్లు కేటాయించింది. అందులో 8 కోట్లు ఖర్చు కాగా రూ. 42 కోట్లు మిగిలిపోయాయి. ఆ నిధులను ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో బాసర అభివృద్ది కోసం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటుందన్న ఆశతో ఉన్న స్థానికులకు బుధవారం నాటి బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసింది.

అమ్మవారి ఆలయ అభివృద్ధి అటకెక్కినట్లేనా... ?

ఈ బడ్జెట్‌లో బాసర ఆలయ ప్రస్తావననే లేకుండా పోయింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్న కనీసం రూ. 42 కోట్లను సైతం కేటాయించ లేదు. ఈ రెండు, మూడు నెలల్లో బాసరకు వచ్చిన మంత్రి సీతక్క బాసర అభివృద్ధి కోసం రూ. 50 కోట్లు కేటాయిస్తామని, అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీలు గుప్పించింది. కాని బడ్జెట్‌లో మాత్రం నయా పైసా కేటాయించకపోవడం హామీల అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రిపుల్ ఐటీకి అరకొరగా కేటాయింపు

ట్రిపుల్ ఐటీలో 9 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ యూనివర్సిటీ పూర్తి స్థాయిలో రెసిడెన్షియల్ క్యాంపస్. ప్రభుత్వమే అన్ని వసతి సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏడాదికి రూ. 160 కోట్లు అవసరముంటుందని యూనివర్సిటీ అధికారులు బడ్జెట్ కంటే ముందు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించారు కాని బడ్జెట్‌లో మాత్రం రూ. 39.31 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు యూనివర్సిటీ అవసరాలకు ఏ మాత్రం సరిపోవని క్యాంపస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కేటాయించిన నిధులు మొత్తం విడుదలైతే ఉద్యోగుల జీత భత్యాలకే సరిపోతాయని పేర్కొంటున్నారు. గత ఏడాది కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 35 కోట్ల వరకు కేటాయిస్తే ఇప్పటి వరకు రూ. 20 కోట్లు విడుదల చేశారు. ఇలా యూనివర్సిటీకి కేటాయింపుల్లో కోత విధిస్తూనే నిధులను విడుదల చేయకపోవడం యూనివర్సిటీని సమస్యల్లోకి నెట్టేసే పరిస్థితి ఏర్పడుతుంది.

బాసరకు తీరని అన్యాయం (సాయినాథ్, బాసర)

బాసరకు నిధులు కేటాయించకపోవడం అన్యాయం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బాసర వెనుకబాటు తనానికి కారణమవుతుంది.

అడవుల్లో చెలరేగుతున్న కార్చిచ్చు

● వారం రోజులుగా నిత్యం ఖానాపూర్ రేంజ్ పరిధిలో తగులబడుతున్న అడవులు ● రహదారులపై కమ్ముకుంటున్న దట్టమైన పొగ
● ఆగమవుతున్న వన్యప్రాణులు ● మంటలను తప్పించుకునేందుకు పరుగులు పెడుతూ గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోతున్న వన్యప్రాణులు


ఖానాపూర్ మండలం రంగాపేట్ శివారులో అడవుల్లో వ్యాప్తి చెందుతున్న మంటలు

ఖానాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జింకలు, కుందేళ్లు, చుక్కల దుప్పులు, నీలుగాయిలు, కొండ గొర్రెల్లాంటి ఎన్నో రకాల శాఖాహార జంతువులు, ఎలుగు బంటి, చిరుత, హైనా, పెద్దపులి లాంటి మాంసాహార జంతువులతో పాటు ఎన్నో రకాల అందమైన పక్షులకు నిలయమైన ఖానాపూర్ ప్రాంత అడవుల్లో గత వారం రోజులుగా మంటలు చెలరేగుతున్నాయి. ఒక్క దగ్గర రాజుకున్న మంటలు క్రమేపి అడవంతా వ్యాపిస్తూ పచ్చని అడవులను బొగ్గులలాగా మారుస్తున్నాయి. ఈ క్రమంలో ఇక్కడి అడవుల్లో తలదాచుకుంటున్న వన్యప్రాణులు మంటల తాకిడిని తట్టుకోలేక ఆగమవుతున్నాయి. ఎండిన ఆకులకు రాజుకున్న అగ్గి అడవుల్లో ఎండిపోయిన చెట్లను కట్టెలను కాలుస్తూ నలువైపుల నుంచి మంటలు వ్యాప్తి చెందడంతో ఆ అడవుల్లో ఆవాసం ఏర్పాటు చేసుకున్న వన్య ప్రాణులు మంటల బారి నుంచి తమను తాము రక్షించు కునేందుకు పరుగులు పెడుతున్నాయి. ఈ క్రమంలో అడవులను ఆనుకొని ఉన్న చెరువులు, కుంటల వైపు పరుగులు పెట్టి ఉపశమనం పొందుతున్నాయి. ఈ మంటలు వేడిని తట్టుకునేందుకు పరుగులు పెట్టే క్రమంలో అడవుల్లోని కందకాలలో, కుంటల్లో, చెరువుల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నాయని పలువురు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం ఖానాపూర్ మండలం తర్లపాడ్ శివారులోని ఓ చెరువులో చుక్కల దుప్పి కళేబరం కనిపించింది. సదరు చుక్కల దుప్పిని కుక్కలు వెండించడంతో నీటి కుంటలో పడి చనిపోయిందని కొందరు, నీళ్ల తాగేందుకు వచ్చి అక్కడి గుంతల్లో పడి చని పోయిందని మరికొందరు అధికారులు తెలిపారు. కానీ గత వారం రోజులుగా ఇక్కడి అడవుల్లో రాజు కుంటున్న మంటల నుంచి ఉపశమనం పొందేందుకు చెరువువైపు పరుగులు తీస్తూ వచ్చిన సదరు చుక్కల దుప్పి నీటి గుంతలో పడి ప్రాణాలు కోల్పోయి ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అడవుల్లో చెలరేగుతున్న మంటలకు వన్యప్రాణులు గ్రామాల శివారులకు పరుగులు తీస్తే ఓవైపు వేటగాళ్లు, మరోవైపు వేట కుక్కలతో వాటి ప్రాణాలకు ముప్పు వాటి ల్లుతుందని వన్యప్రాణి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఖానాపూర్ - నిర్మల్, నిర్మల్ - మంచిర్యాల, ఖానాపూర్ - ఎర్వ చింతల్ రహదారులను ఆనుకుని మంటలు భారీగా చెలరేగుతుండడంతో రోడ్లపై భారీగా దట్టమైన పొగ అలుముకుంటోంది. ఈ పొగను దాటుకొని వాహనాలపై ప్రయాణించాలంటే ఊపిరి దిగబట్టాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో మీటర్ల తరబడి రహదారులపై కార్చిచ్చు పొగ కమ్ముకోవడంతో ఓవైపు ఊపిరి ఆడటం లేదని మరోవైపు కళ్లు మంటలేస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వెళ్లే ప్రయాణికుల పరిస్థితి ఇలా ఉంటే అడవుల్లో ఉండే వన్యప్రాణుల పరిస్థితి ఎలా ఉంటుందోనని పలు వురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవుల్లో మంటలను ఇకనైనా అదుపు చేయకపోతే పరిస్థితి మరింత తీవ్రతరంగా మారుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవుల్లో మంటలను నివారించేందుకు చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరంగా నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా ఖానాపూర్ మండల అడవుల్లో ఏదో ఒక ప్రాంతంలో కార్చిచ్చు రాజుకుం టున్న నేపథ్యంలో నివారణ చర్యలు ఏవిధంగా చేపడుతున్నారో తెలుసుకునేందుకు ఖానాపూర్ అటవీ రేంజ్ అధికారిని ఆంధ్రజ్యోతి సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు.


నిర్మల్, మంచిర్యాల రహదారి అడవుల్లో కార్చిచ్చు రాజుకోవడంతో రోడ్డుపై అలుముకున్న పొగ


ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులతో ఉపాధ్యాయురాళ్లు

కేజీబీవీ విద్యార్థులకు వీడ్కోలు

నర్సాపూర్(జి), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలలో, కళాశాలలో గత ఏడేళ్ల కిందట అడ్మిషన్ పొందిన బాలికలు గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగి సిన సందర్భంగా స్కూల్, కాలేజీ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. టీచర్లు పిల్లలందరికీ మా కన్న మంచి భవిష్యత్తు మీరు పొందాలని, ఈ పాఠశాలను, కళాశాలను ఎప్పటికీ మరిచిపోవద్దని, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి మళ్లీ నర్సాపూర్ పాఠశాలకు వచ్చి మీ అనుభవాలను పంచు కోవాలని ఆశీర్వదించి పంపించారు.

మందు బాబులకు అడ్డాగా తాంసి హైస్కూల్

తాంసి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాంసి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతిరోజు సాయంత్రం చీకటి పడిందంటే చాలు ఆ పాఠశాల ప్రాంగణంలోకి చేరి ఇష్టానుసారంగా మద్యం తాగుతూ ఖాళీ సీసాలను పగుల గొడుతున్నట్లు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పేర్కొంటున్నారు. ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది అని అంటున్నారు. ఈ పాటికే కొంతమంది విద్యార్థులకు మద్యం సీసాలు కాళ్లకు గుచ్చుకొని గాయాలైనట్లు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలోనే ఇలాంటి పరిస్థితులు ఉన్నా యంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఈ జిల్లా పరిషత్ పాఠశాలకు ఆనుకొని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఉంది. ఇదే ప్రాంగణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సైతం ఉన్నాయి. ఈ రెండు గోడల పక్కన సైతం అక్కడక్కడ మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగి ఉన్నాయని పలువురు అంటున్నారు. గ్రామానికి చెందిన యువకులు అక్కడ క్రీడలు ఆడుకుంటున్న సమయాల్లో సైతం మద్యం సీసాలు కుచ్చుకుని పలువురికి గాయాలయ్యాయి. ఇకనైనా పోలీసులు తగిన చర్యలు తీసుకొని ఇక నుంచి అయినా పాఠశాల ఆవరణలో మద్యాన్ని నిషేధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు

ఎడారిని తలపిస్తున్న తాంసి వాగు


పూర్తిగా ఎండిపోయిన వాగు

తాంసి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రమైన తాంసి వాగు పూర్తిగా ఎండిపోయింది. ఎన్నడూ లేని విధంగా ఎడారిని తలపించే రీతిలో కనిపిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 80 ఏళ్ల నుంచి కూడా ఇప్పటివరకు ఎండిపోయి కనిపించలేదని గ్రామ వృద్ధులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం తాంసీలో సాగునీటితో పాటు తాగు నీటి కొరత మొదలైంది. గ్రామానికి అందించే నల్ల నీళ్ల సైతం రావడం లేదు. ఆ బోరు సైతం అడుగంటి పోయింది. తాంసి పరిస్థితి ఇలా ఉంటే మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా తాగునీటి కొరత తీవ్రమైందని ప్రజలు అంటున్నారు. కొందరు ఎడ్లబండ్లపై నీళ్ల తెచ్చుకునే పరిస్థితులు నెలకొంటున్నాయి. వేసవికాలం ఆరంభంలోనే ఇలా ఉంటే రానున్న మూడు నెలల్లో పరిస్థితి ఎలా ఉంటాయో అని మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గిరిజన గ్రామమైన అట్నం గూడా, లింబు గూడ, అంబుగావ్ గ్రామాలలో అప్పుడే తాగునీరు కరువైంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


హాల్ టికెట్‌లతో కుంటాల పాఠశాల విద్యార్థినులు


కుంటాల పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నేరడిగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే విజయం సొంతం చేసుకోవచ్చని ప్రధానోపాధ్యాయుడు గుగ్లోత్ అంబరావు అన్నారు. మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షిక వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక ప్రణాళికలో భాగంగా ని ర్వహించిన వివిధ రకాల పోటీ పరీక్షలు, ప్రతిభా పాటవ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు గుగ్లోత్ అంబరావు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో హైమాస్ లైట్, స్టేజ్ నిర్మాణం, ఐటీడీఏ పీవో ఖుస్బూ గుప్తా పాఠశాల కాంపౌండ్‌కు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు, ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గేమ్స్‌లలో జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు రాణించి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

కార్యాలయంలో వాహనాలు.. చెట్ల కింద ప్రజలు

కుభీర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి మండలంలోని 42 గ్రామ పంచాయతీ, 20 అనుబంధ గ్రామాల ప్రజలు రోజు వందలాదిగా కార్యాలయానికి పనుల కోసం వస్తుంటారు. అయితే వేసవి ఎండల దృష్ట్యా ఆవరణలో ప్రజల కోసం బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేసే స్థలాన్ని కార్యాలయ అధికారులు, సిబ్బంది ద్విచక్రవాహనాలకు స్టాండుగా మార్చడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు చెట్ల క్రింత కూర్చుని పనుల కోసం వేచి చూస్తున్నారు.


కార్యాలయం ఆవరణలో అధికారులు, సిబ్బంది వాహనాలు

ప్రమాదం జరిగితే.. గుర్తించేదెలా..?

● భారీ వాహనాలకు కనిపించని నంబర్ ప్లేట్లు
● పట్టించుకోని రవాణా, పోలీసుశాఖ అధికారులు


ఇచ్చోడ రహదారిపై నిలిచిన టిప్పర్‌కు కనిపించని నంబర్ ప్లేట్

ఇచ్చోడ, మార్చి, 20 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, నేరడిగొండ ప్రాంతాల్లో పలువురు డ్రైవర్లు తమ టిప్పర్‌ల నంబర్ ప్లేట్ కనిపించకుండా మట్టి, బురద పూస్తున్నారు. కొన్నింటికి అసలు నెంబరు ప్లేట్‌లే ఉండడం లేదు. మరో వైపు టిప్పర్‌ల డోర్‌లు ప్రమాదకరంగా ఉంటున్నాయి. ఇచ్చోడ మండల కేంద్రంలో ఓటిప్పర్ క్యాబిన్ డోర్ ఊడి పోవడంతో దాన్ని ఒక తాడుతో వెనకకు కట్టారు. తాడు తెగి పోయి ద్వారం వేలాడితే వెనుక వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదం బారిన పడే అవకాశం ఏంతైనా ఉంది. టిప్పర్‌లకు సంబంధించిన యాజమానులు కోట్ల బిజినెస్ చేస్తున్నారే తప్ప.. రూల్స్‌తో మాకేం పనిలేదన్నట్లు వ్యవ హరిస్తుండడం గమనార్హం. పోలీసులు సైతం ఇలాంటి వాహనాలకు ఎలాంటి ఫైన్‌లు వేయకపోవడం విచిత్రం. పోలీసుల కళ్లు కప్పి వాహనాలు నడిపించడం ఆ డ్రైవర్లు, ఓనర్ల గొప్పతనం. ఇకనైనా పోలీసు, ఆర్టీఓ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై నడిచే వాహనాల ఫిట్‌నెస్, వాహనాల ధ్రువపత్రాలు పరిశీలిస్తె ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని స్థానికులు కోరుతున్నారు.

అడుగంటిన దేగామ ప్రాజెక్టు నీటికి తంటాలు తప్పవా..!?

బోథ్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో ఎండలు మండి పోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటి పోయా యి. మరోవైపు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులలో సైతం నీరు ఎండిపోవడంతో బోరు బావులు ఎండిపోతున్నాయి. ఫలితంగా తాగునీటికి సాగునీటికి ఇబ్బంది తప్పడం లేదు.

● **వాగుల చుట్టూ మోటార్లే**

నియోజకవర్గంలోని పలు గ్రామాల పరిసరాలలో ఉన్న వాగుల నుంచి రైతులు పంటలు సాగు చేసేందుకు వాగుల లో విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి సాగునీటి వినియోగిం చుకుంటున్నారన్నారు. అయితే దీంతో వాగులు ఎక్కడికక్కడే ఎండిపోయి నీటి జాడలు లేకుండా పోయాయన్నారు. సోనాల వాగు పరివాహక ప్రాంతంలో చింతల బోరి గ్రామం సమీపంలో కొంతమంది రైతులు జెసిబీల ద్వారా పది ఫీట్ల లోతులో తవ్వకాలు చేసి నీటిని పొలాలకు వాడుకోవడంతో సోనాల వాగు అడుగంటి పోయింది. దీంతో సోనాల రైతులు, గ్రామ ప్రజలు వాగు పరివాహక ప్రాంతాల రైతులకు సాగునీరు అందకుండా త్రీ ఫేస్ కరెంటు సరఫరా నిలిపివేయాలని అధికారులను కోరడం జరిగింది. దీంతో వాగు ప్రవాహం ప్రారంభమై భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులంటున్నారు.


నీరు లేక బోసిపోయిన దేగామ చెరువు

● **ముందు చూపు లేకపోతే తప్పదు కరువు**

నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన కలిగించడంతో పాటు ముందు జాగ్రత్త చర్యగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి అనేది ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. మరోవైపు గ్రామాల పరిసరాలలో ఉన్న వాగుల నుంచి ఇసుక తరలించకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. అంతేగాక గ్రామాల సమీపంలో వీలున్నచోట చెక్ డ్యాములు కుంటల నిర్మాణం అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

● **ఎప్పుడు ఇంతటి నీటి ఎద్దడి చూడలేదు**
- ఈదుగాం పోతన్న, పశువుల కాపరి



తాను ఇంతటి నీటి ఎద్దడిని ఎన్నడూ చూడలేదని పొచ్చెర గ్రామానికి చెందిన పశువుల కాపరి ఈదుగాం పోతన్న పేర్కొన్నారు. మార్చి నెలలోనే ఎండలు మండి పోతున్నాయని ఫలితంగా సాగు నీటి మాట దేవుడెరుగు కానీ తాము పశువులను మేపాలంటే ఇబ్బం దులకు గురవుతున్నామన్నారు. అంతేగాక పశువులకు మధ్యాహ్నం పూట తాగునీటికి సమీపంలోని వాగులు చెరువులకు పశువులను తీసుకు వెళ్లే వారమని ఈ ఎండల తీవ్రత చూసి ముందు ముందు ఎలా ఉంటుం దోనని ఆందోళన కలుగుతుందన్నారు.


నీటి తడి లేదు.. పంట దిగుబడి రాలేదు!



వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతున్నాయి. చెన్నలో బోర్లు ఎండిపోవడంతో రబీ పంటలకు నీరదించలేని పరిస్థితి లేదు. గుడిహత్నూర్ మండలం కోల్హారి గ్రామంలో ఓ రైతు తర్బూజా పంటను సాగు చేశారు. పంట చేతికొచ్చే సమ యంలో సరిపడా నీరు లేకపోవడంతో పాటు వివిధ రకాల కీటకాలు ఆశించడంతో పంట ఎదగలేకపోయింది. కేవలం చిన్న చిన్న పిందెలు మాత్రమే కాయడంతో ఆశించిన దిగుబడి రాలేక రైతులు దిగాలు చెందుతున్నారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

● (స్టాఫ్, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

ఫొటో న్యూస్





'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 47 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 9,129 మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు

నిర్మల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. దీని కోసం గాను సంబంధిత విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ఈ సారి 9129 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలను రాయబోతున్నారు. 4444 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు రాయబోతుండగా 4685 మంది ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు రాయనున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. దీంతో పాటు స్పెషల్‌స్వార్డ్‌లను సైతం నియమించారు. మాస్ కాపీయింగ్‌కు చోటు లేకుండా ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలంటూ ఇప్పటికే కలెక్టర్‌తో పాటు ఈ పరీక్షలను పర్యవేక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సంబంధిత చీఫ్ సూపరిండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లకు హెచ్చరికలు జారీ చేశారు. మాస్ కాపీయింగ్‌ను అడ్డుకునేందు కోసం అన్ని పరీక్షకేంద్రాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగానే సీసీ కెమెరాలతో నిఘాను కొనసాగించనున్నారు. ప్రతీరోజూ విద్యాశాఖ అధికారులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరీక్షించి అక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టబోతున్నారు. ఇప్పటికే ఇన్విజిలేటర్‌లకు, చీఫ్ సూపరిండెంట్‌లకు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు పరీక్షలకు సంబంధించి శిక్షణలు కూడా ఇచ్చారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని సైతం నియమిస్తున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్‌లను సైతం మూసి ఉంచనున్నారు.

మాస్ కాఫీయింగ్‌పై పకడ్బందీ నిఘా

కాగా పదవతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ నిఘాను సారించబోతున్నారు. ప్రతీకేంద్రంలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు స్పెషల్‌స్వార్డ్, సిట్టింగ్‌స్వార్డ్‌లను సైతం నియమించారు. అలాగే రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఓ ఉన్నతాధికారిని పరిశీలకునిగా నియమించారు. ముమ్మర తనిఖీలు కూడా చేపట్టబోతున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఎస్ఎస్‌సీ పరీక్ష ఫలితాల్లో జిల్లా మొదటి వరుసలో నిలుస్తున్న సంగతి తెలిసిందే. మళ్లీ ఈ సారి కూడా జిల్లాను మొదటి వరుసలో నిలిపేందుకు విద్యాశాఖ అధికారులు గత నాలుగైదు నెలల నుంచి పకడ్బందీ చర్యలు చేపట్టారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు స్టడీ మెటీరియల్‌ను అధించడం అలాగే ముందస్తు పరీక్షలను నిర్వహించి వారి సామర్థ్యంను తెలుసుకొని ప్రత్యేక దృష్టి సారించారు.

పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా పరీక్ష కేంద్రాల వద్ద జనం గుమిగూడకుండా అలాగే కేంద్రాల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన బందోబస్తుపై సంబందిత అధికారులతో జిల్లా ఎస్పీ జానకీషర్మిల సమీక్ష సమావేశం నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలో 30 యాక్ట్ అమలులో ఉన్న కారణంగా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోనున్నారు. పెట్రోలింగ్‌ను కూడా ముమ్మరం చేయనున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పోలీసు సిబ్బందిని నియమించి ఇతరులెవరినీ పరీక్షకేంద్రంలోనికి ప్రవేశించకుండా చర్యలు చేపట్టనున్నారు.

ఈసారి అడిషనల్ షీట్లు ఉండవు

కాగా ఈ సారి పరీక్షల్లో కొన్ని మార్పులు చేపట్టారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి విద్యార్థులకు అడిషనల్ షీట్లు ఇవ్వడం లేదు. మొత్తం 24 పేజీలతో కూడిన బుక్‌లెట్‌ను అందించనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం కానుండగా విద్యార్థులు 9గంటల వరకే పరీక్షహాల్‌లోకి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సారి ఐదు నిమిషాలు దాటినప్పటికీ కూడా విద్యార్థులను అనుమతించాలంటూ అధికారులు ఆదేశించారు. పదవ తరగతి పరీక్షలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి మొదటి నుంచి ముందస్తు చర్యలు చేపట్టారు. దీని కారణంగా ఏర్పాట్లన్ని పకడ్బందీ చేపట్టారు.

పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి : కలెక్టర్



టెలీకాన్ఫరెన్‌లో కలెక్టర్

నిర్మల్ అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పదవ తరగతి పరీక్షల నిర్వ హణపై విద్యాశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పదవ తరగతి బోర్డు పరీక్షలను ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశిం చారు. పరీక్షల పట్ల భయాన్ని, ఒత్తిడిని అధిగమించేలా విద్యార్థుల్లో మానసిక స్థైర్యం నింపాలన్నారు. పరీక్షలకు సంబంధించి ఎవరికైనా ఎ లాంటి సందేహాలున్న ఎస్ఎస్‌సీ కంట్రోల్ రూమ్‌నంబర్ 90599 87730ను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో పి. రామారావు, విద్యాశాఖ అధికారులు ఎం. పరమేశ్వర్, పద్మ, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం..టెలి కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, విద్యాశాఖ అధికారులతో ఎస్ఎస్‌సీ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణ, తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు.

జిల్లాలో తేలికపాటి వర్షం

నిర్మల్, మార్చి, 20 : (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో అక్కడక్కడ గురువారం రాత్రి తేలికపాటి వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో మొదలైన వాన దాదాపు 15 నిమిషాల పాటు కొనసాగింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొద్ది పాటి వాన వరి పంటకు మేలు చేయగా, ఆరోబోసిన మొక్కజొన్న రైతులను ఆందోళనకు గురిచేసింది. నిర్మల్ జిల్లాలో వర్షాభావంతో వరి పంటకు నీరందక అనేక మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి గురువారం రాత్రి కురిసిన వానజల్లుతో కొంత వరకు మేలు జరిగింది.

రేపటి నుంచి రెండు రోజులు నీటి సరఫరా బంద్

నిర్మల్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలో శని, ఆదివారాలు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్టు నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. మిషన్ భగీరథ, వాటర్ ప్లాంట్ మాటేగాం మరమ్మతుల దృష్ట్యా పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని పంపింగ్ పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

పరీక్షల సహాయ కమిషనర్‌గా పరమేశ్వర్ బాధ్యతల స్వీకరణ

నిర్మల్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో పరీక్షల సహాయ కమిషనర్‌గా మూడారపు పరమేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాలికల ఉన్నత పాఠశాల సోమవార్‌పేట్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా ఆయనకు అదనపు బాధ్యత అప్పగించారు. కలెక్టర్ ఆదేశం మేరకు పరమేశ్వర్‌ను డీఈవో రామారావు ఈ పోస్టులో నియమించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

'పది' పరీక్ష ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకుడు

నిర్మల్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుండి నిర్వహించనున్న పది పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. చాణక్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సీఎస్, డీవోలను ఆదేశించి, సీటింగ్ ఏర్పాట్లు పద్ధతి ప్రకారం ఉండాలన్నారు. ఇన్విజిలేటర్లు ఐడీ కార్డులు కలిగి ఉండాలని, మొబైల్ ఫోన్లను అనుమతించవద్దని సూచించారు. ఓఎంఆర్ షీట్లను చెక్ చేయాలని, సబ్జెక్టు టీచర్లు విధుల్లో ఉండరాదన్నారు. పరీక్షల సహాయ కమిషనర్ మూడారపు పరమేశ్వర్, మోహన్ రావు, మునిందర్ రాజు, తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : కూచాడి



నిర్మల్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు తెలిపారు. బుధవారం మండలంలోని అక్కాపూర్ గ్రామంలో ద్వారకానగర్‌లో 75 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లోల అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సీసీ రోడ్లు మంజూరు చేసిందని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ద్వారకానగర్ కాలనీ ప్రెసిడెంట్ రాజన్న, ఉపాధ్యక్షులు భీమ్ సింగ్, రాజలింగం, రామకృష్ణ, గబ్బర్‌సింగ్, పోశెట్టి, మౌలానా, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

నిర్మల్ అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో మాలలకు కేవలం ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం నిర్మల్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



నిర్మల్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తాపూర్ గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మణచాంద మండలంలోని చింతల్‌చందా గ్రామ గోదావరి నుండి ఏపీ 25 వై 0545 టిప్పర్‌లో బుధవారం రాత్రి నిర్మల్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

25న మెడికల్ కళాశాలలో టీచింగ్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు

నిర్మల్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మెడికల్ కళాశాలలోని పలు విభాగాల్లో టీచింగ్ ఫ్యాకల్టీ నియామకాలు కాంట్రాక్ట్ పద్ధతిన చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాలిచ్చారని తెలిపారు. కలెక్టర్ అనుమతితో చేపట్టబోయే నియామకాలకు ఆసక్తి గల అభ్యర్థులు నిర్మల్ మెడికల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వైద్యులు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ విద్యార్హతలు కలిగి ఉండాలని, గౌరవ వేతనంతో కూడిన కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేస్తారని తెలిపారు. ఈ నెల 25న ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మెడికల్ కాలేజీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థుల విజయ కేతనం

నిర్మల్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలో స్థానిక విజయ హైస్కూల్ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. మనోజ్ఞ, హిమజ, సాయి శ్రేష్ఠ, సాక్షి యాదవ్ స్టేట్ టాపర్లుగా నిలిచారు. 9 మంది జిల్లా టాపర్లుగా, 18 మంది కన్సోలేషన్ బహుమతులను సాధించారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ కోదండరాం, ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల జనరల్ సెక్రటరీ అయ్యన్నగారి భూమయ్య, కరస్పాండెంట్ నాగభూషణం, ఈసీ సభ్యులు విజయలక్ష్మి, ఆమెడ కిషన్, ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.

పనులను సద్వినియోగం చేసుకోవాలి

ముథోల్, మార్చి 20 (ఆంధ్రజ్యోత) : గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. మండలంలోని బ్రహ్మన్‌గాం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు చలో జనగామ

నిర్మల్ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చలో జనగామ కార్యక్రమం చేపట్టినట్లు ప్రధాన కార్యదర్శి పొన్నం నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలని అక్కడ ఒక్కరోజు నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, అధికారులకు సమాఖ్య సభ్యులు పూల మొక్కలను అందించి, స్వాగతం పలికారు. కలెక్టర్, అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలు నేడు తమ స్వయంకృషితో అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. జిల్లా స్వయం సహాయ సంఘాలకు జాతీయస్థాయిలో అనేక అవార్డులు లభించాయని, ఇది ఎంతో గర్వకారణమైన విషయమని తెలిపారు. జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టినందుకు గాను డీఆర్‌డీవో విజయలక్ష్మి, మహిళా సంఘాలకు అభినందనలు తెలిపారు. జిల్లాకు మహిళా సంఘాలే బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు. నిర్మల్ కొయ్య బొమ్మలను భావితరాలకు అందించుటకై కొయ్యబొమ్మల తయారీలో వినియోగించే పొనికి కర్రలను ఉత్పత్తి చేయడానికి సమాఖ్య ఆధ్వర్యంలో పొనికి వనాలు పెంచడం గొప్ప విషయం అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రత్యేకంగా నాణ్యమైన విత్తనాలను సేకరించి, పరీక్షలు జరిపి మండలాల వారీగా మహిళా సంఘాలకు విత్తనాలను అందజేసి విత్తన నిధులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విత్తననిధికి సంబంధించి పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. మహిళలతో కలిసి కేక్‌ను కట్ చేసి మహిళలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు గంగామణి, మహిళ సమాఖ్య సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఎన్నికల సంఘం నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఎన్నికల సంఘం నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సంబం,దించిన అన్ని నియమాలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాల న్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లుగా నియమించుకోవాలని, ఏజెంట్ల బాధ్యతలు, హక్కులను తెలియజేయాలని సూచించారు. ఫారం 6, 7, 8లకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దుకునే అవకాశం కల్పించడం జరిగిందని, ఓటర్లు తమ పేరు, చిరునామా, తదితర వివరాలు సవరించుకోవాలనుకుంటే తహసీల్దార్, మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాల్లో తమ దరఖాస్తులను ఇవ్వవచ్చునన్నారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరిని తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఒకే ఓటరు ఇతర చోట్ల ఓటు హక్కు ఉన్న నకిలీ ఓటర్ల ఏరివేత ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం తీసుకునే చర్యల్లో రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, బీజేపీ, టీడీపీ, వైఎస్ఆర్ సీపీ, ఎంఐఎం ఆమ్ ఆద్మీ పార్టీల ప్రతినిధులు కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, రమేష్, నరేష్, మజార్, షేక్ హైదర్‌లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తవద్దు

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

దస్తురాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 13 గ్రామ పంచాయతీ కార్యదర్శులతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేష్, ఎంపీవో రమేష్‌రెడ్డి, పంచాయతీ కార్య దర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

కుభీర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని అన్నబాహుసాఠే విగ్రహం వద్ద గురువారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పద్మభూషన్ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. దళిత నాయకులు కోత్తూరి శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు గోరేకర్ కాశీనాథ్, గోనేకర్ కళ్యాణ్, ఎంపేల్కర్ జీవన్, ఎంపేల్కర్ నాగేష్, గోరేఖర్‌బాబు, కళ్యాణ్, బాలాజీ, సురేష్, తదితర మాదిగ సమాజం నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పికి గాయాలు



గాయపడిన చుక్కల దుప్పికి చికిత్స చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఖానాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమీప అడవుల్లో సంచరిస్తున్న చుక్కల దుప్పిని కుక్కలు వెంబడించాయి. దీంతో గురువారం చుక్కల దుప్పి డబుల్ బెడ్ రూమ్ కాలనీ వైపు పరిగెత్తుకుంటూ వచ్చింది. ఇది గమనించిన స్థానికులు కుక్కలను తరిమేసి వాటి బారి నుండి చుక్కల దుప్పిని కాపాడారు. గాయపడిన చుక్కల దుప్పిని అటవీ అధికారులకు అప్పగించగా అటవీ అధికారులు ఆ చుక్కల దుప్పికి వైద్యం చేయించి సమీప అడవిలోకి వదిలిపెట్టారు. కాగా సదరు చుక్కల దుప్పి నీళ్ల కోసమే జనావాసాల సమీపంలోకి వచ్చి ఉంటుందని స్థానికులు తెలిపారు. వన్యప్రాణులు సంచరించే కారిడార్ అయినందున వన్యప్రాణులు తిరుగుతాయని ఈ క్రమంలోనే కుక్కలు వెంటాడి ఉంటాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. వన్యప్రాణులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా అడవుల్లో నీటి చెలిమెలను, సాసర్ పీట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

'అరెస్ట్‌ను ఖండిస్తున్నాం'

సోన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు యాదయ్య గౌడ్‌ను అరెస్ట్‌ను ఖండిస్తున్నామని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వినోద్ కుమార్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు.

సామాజిక న్యాయమే నా లక్ష్యం : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఏఎంసీ నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, శ్రీహరిరావు

ఖానాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనకు సామాజిక న్యాయమే లక్ష్యమని అందులో భాగంగానే నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పదవుల కేటాయింపు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. గురువారం ఖానాపూర్‌లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఉదయం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నరోగులను పరామర్శించి వైద్యసేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో కలిసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి అన్ని మతాలు, అన్ని కులాలు సమానమేనన్నారు. అంతే తప్ప ఎటువంటి డబ్బులు లావాదేవీలు జరగలేదని స్పష్టం చేశారు. పార్టీలో కొనసాగే కోవర్టులు కాంగ్రెస్‌ను వదిలి వెళ్లాలని హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే సామాన్యుడికి పట్టం సాధ్యమైంది...

కాంగ్రెస్ పార్టీతోనే సామాన్యులకు సైతం పట్టం కట్టడం సాధ్యమైందని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, పీఏసీఎస్ చైర్మన్లు ఆమంద శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భూషణ్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్సాపూర్(జి), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా గురువారం కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తానూర్‌లో..

తానూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రకాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.